# 93. యజమాని-బానిస

కృష్ణానందానికి కొద్దిగా పైకం అవసరం అయి, తన చిరకాల మిత్రుడ్ని చూడటానికి అతని ఫేక్టరీకి వెళ్ళాడు. కృష్ణానందాన్ని చూసి ఆ మిత్రుడు సంతోషించాడు. తను వచ్చిన పని చెప్తే మేనేజర్ బేంకుకి వెళ్ళాడని, రాగానే పైకం ఇస్తానని అతను వచ్చేదాకా వేచి ఉండమని మిత్రుడు కృష్ణానందానికి చెప్పాడు. తన మిత్రుడు తన కింద పనిచేసే వారితో వ్యవహరించే తీరుని గమనించాడు కృష్ణానందం. వారి మీద ఎక్కడా అజమాయిషీ ఉన్నట్లుగా కనపడలేదు.

"ఇదేమిటి? నువ్వు యజమానివి కదా? మరి వాళ్ళ దగ్గర నీ ప్రవర్తన అలా లేదే? వాళ్ళు నీకు సలాంలు కొట్టడం లేదు. నీ ముందే నువ్వు కూర్చోమనకుండా కూర్చుంటున్నారు. నాకిదేం నచ్చలేదు." చెప్పాడు కృష్ణానందం.

అతని మిత్రుడు చిన్నగా నవ్వి అడిగాడు.

"పూర్వం ఆవిరి యంత్రం కనుక్కోక మునుపు బానిసలని ఓడలు నడపడానికి తీసుకెళ్ళేవారని నువ్వు విన్నావా?"

"విన్నాను. ఓ ఇంగ్లీష్ సినిమాలో చూసాను కూడా. వాళ్ళని తెడ్లు వేయమని కొరడాలతో కొడతారు."

"నువ్వా బానిసల స్థానంలో ఉండటానికి ఇష్టపడతావా?"

"చస్తే ఇష్టపడను." చెప్పాడు కృష్ణానందం.

"ఎందుకని? వాళ్ళ యజమాని చెడ్డవాడనా?"

"అవును."

"మనం ఒకరి కింద బానిసగా ఉండటానికి ఎలా ఇష్టపడమో అలాగే ఎవరూ యజమానిగా ఉండటానికి ఇష్టపడకూడదు. మనం యజమానిగా ఉన్నామంటే ఒకర్ని మనకి బానిసగా చేస్తున్నట్లే."

తన మాటలు అర్థం చేసుకోడానికి కృష్ణానందంకి కొంత సమయం ఇచ్చి మళ్ళీ చెప్పాడు ఆ మిత్రుడు.

"దీన్ని అలుసుగా తీసుకుని నా దగ్గర పని చేసే వాళ్ళల్లో ఎవరైనా తప్పు చేస్తే తిట్టడం లాంటివేం చేయను. ఉద్యోగంలోంచి తీసేస్తానని వాళ్ళకి తెలుసు. అంచేత ఇక్కడ అజమాయిషీ లేకుండా పనిచేసే బాధ్యతని సక్రమంగా నిర్వర్తించే వాళ్ళే మిగులుతారు."

ఎవరైతే తమని అజమాయిషీ చేసేవారు లేకుండా కూడా చక్కగా, నిజాయితీగా పని చేస్తారో వాళ్ళు ఆధ్యాత్మికంగా ఉన్నతిని పొందుతారు.

## 94. మూడు ప్రవచనాలు

నసీరుద్దీన్ అంటే మన తెనాలి రామలింగడు లాంటివాడు అనే అభిప్రాయం చాలామందిలో ఉంది. కాని అతను గొప్ప ఆధ్యాత్మికవేత్త. ఓ సారి నసీరుద్దీన్‌ని కొందరు ధార్మిక ఉపన్యాసాన్ని ఇవ్వమని కోరారు. నసీరుద్దీన్ వేదికని ఎక్కి అడిగాడు.

"ప్రజలారా! నేనేం చెప్పబోతున్నానో మీకు తెలుసా?"

"లేదు. మాకు తెలీదు." చెప్పారు వారు.

"కొద్దిగా అయినా విషయం తెలీకపోతే నేను చెప్పేది మీకు అర్థం కాదు." నసీరుద్దీన్ వెళ్ళిపోయాడు.

మళ్ళీ వారం తర్వాత ఆ సాధువు దగ్గరికి వచ్చి ఆధ్యాత్మికత గురించి కొంత తెలుసుకున్నామని, వచ్చి ప్రవచనం చెప్పమని వారు కోరారు. నసీరుద్దీన్ ఒప్పుకున్నాడు.

వేదికని ఎక్కాక నసీరుద్దీన్ అడిగాడు.

"ప్రజలారా! నేనేం చెప్పబోతున్నానో మీకు తెలుసా?"

"తెలుసు." ముక్త కంఠంతో జవాబు చెప్పారు సభికులు.

"తెలిసాక ఇంక నేను మీకు చెప్పడానికి ఏం ఉంది?" వెళ్ళిపోయాడతను.

మరో వారం తర్వాత మళ్ళీ నసీరుద్దీన్ దగ్గరికి వెళ్ళి ప్రవచనం చెప్పడానికి రమ్మని కోరారు వాళ్ళు. సరేనన్నాడు అతను.

వేదికని అలంకరించాక అడిగాడు నసీరుద్దీన్.